ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
మంగళవారం 2 డిసెంబరు 2025



నామినేషన్ల జోరు

- రెండవ రోజు 147 సర్పంచ్..
321 వార్డులకు నామినేషన్లు
- నేటితో ముగియనున్న రెండో విడత

సిరిసిల్ల, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డ అభ్యర్థులు రెండో విడతలో రెండవ రోజు నామినేషన్ల జోరును కొనసాగింది. మూడు మండలాల్లో 88 సర్పంచులు, 758 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 215 నామినేషన్లు, 566 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వచ్చాయి.

రెండో రోజు నామినేషన్ల వివరాలు

మండలం	సర్పంచ్	వార్డులు
బోయిన్‌పల్లి	68	170
ఇల్లంతకుంట	67	235
తంగళ్లపల్లి	80	161
మొత్తం	**215**	**566**


ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం రెండవ రోజు కొనసాగింది. 35 సర్పంచ్ స్థానాలకు 67మంది అభ్యర్థులు, 294 వార్డుసభ్యుల స్థానాలకు 235మంది నామినేషన్లు వేసినట్లు అసిస్టెంట్ డిస్ట్రిక్ ఎన్నికల అథారిటీ శశికళ తెలిపారు. గ్రామాలలో పోటీచేసే అభ్యర్థులు భారీ ర్యాలీ తీస్తు క్లస్టర్ నామినేషన్ కేంద్రాలలో నామినేషన్లు వేశారు. ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నామినేషన్ సెంటర్ల వద్ద బందోవస్తు

తంగళ్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ సెంటర్ సమీపంలోకి ముగ్గురు కంటే ఎక్కువ మందిని అనుమతివ్వడం లేదు. పోలీసులు నామినేషన్ కేంద్రంలోకి వెళ్లే వారి వివరాలు నమోదు చేసుకుని సెంటర్ అవరణలోకి అనుమతి ఇస్తున్నారు. ఎస్‌ఐ ఉపేంద్ర చారి మాట్లడుతూ ర్యాలీకి తప్పనిసరిగా అనుమతి ఉండాలన్నారు.

గుర్తుల కోసం టెన్షన్



- పంచాయతీ ఎన్నికల్లో గుర్తులే కీలకం
- బ్యాలెట్‌పై పేర్లు, ఫొటోలు ఉండవు
- నోటా గుర్తుతోనే తిప్పలు
- సర్పంచ్‌కు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులు
- రేపు తొలి విడత గుర్తుల కేటాయింపు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపులో గుర్తులు చాలా కీలకం. పోటీపడే అభ్యర్థులు ప్రజలకు ఎక్కువగా గుర్తుంచుకునే గుర్తులు తమకు రావాలని కోరుకుంటారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గుర్తులను కేటాయిస్తారు. పంచాయతీ ఎన్నికలు పార్టీలకతీతంగా జరుగుతుండడంతో పార్టీ గుర్తులు ఉండవు. డిసెంబరు 3వ తేదీన తొలివిడత నామినేషన్ల ఉపసంహరణ పూర్తి అయిన తర్వాత బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. మలి, తుది విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. మూడు విడతల్లో జరిగే పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం 50 గుర్తులను ఖరారు చేసింది. ఇందులో సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించారు.

గుర్తులపైనే దృష్టి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 సర్పంచ్, 2,268 వార్డు స్థానాలు ఉన్నాయి. ఇందులో కొన్ని పంచాయతీలు మరికొన్ని వార్డులు ఏకగ్రీవం అవుతున్నాయి. బరిలో నిలిచిన సర్పంచ్ అభ్యర్థులకు గులాబీ బ్యాలెట్ పేపర్, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్ ఏర్పాటు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన తర్వాత రిటర్నింగ్ అధికారి అభ్యర్థుల జాబితాను అక్షర క్రమంలో గుర్తులను కేటాయిస్తారు. ఇద్దరు, అంత కంటే ఎక్కువ మందికి ఒకే పేరు ఉండి వేర్వేరు ఇంటి పేర్లు ఉంటే వారి ఇంటి పేర్లు అక్షర క్రమంలో తీసుకుంటారు. ఎక్కువ మంది ఒకే పేరు, ఒకే ఇంటి పేరు ఉంటే వారి వృత్తి, నివాసం, అడ్రస్ ప్రాతిపాదికన జాబితాలో చేర్చనున్నారు. దాని ప్రకారం గుర్తులను ఖరారు చేస్తారు. మొదటి అభ్యర్థికి మొదటి గుర్తును కేటాయిస్తారు.

సర్పంచ్ , వార్డు సభ్యుల గుర్తులు ఇవీ

సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. వాటిలో ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్బాల్, లేడీస్ పర్సు, టూత్ పేస్ట్, టీవీ రిమోట్, స్పానర్, చెత్త డబ్బా, బ్లాక్ బోర్డ్, బెండకాయ, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్ జాలీ, చేతి కర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్‌మెన్, తెర చేపతో పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, క్రికెట్ స్టంప్స్ గుర్తులు ఉన్నాయి. వార్డు సభ్యుల అభ్యర్థులకు గౌను, గ్యాస్ స్టవ్, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండ, డిష్ యాంటీనా, గరాటా, మూకుడు, ఐస్ క్రీమ్, గాజు గ్లాస్, పోస్ట్ డబ్బా, ఎన్వలప్ కవర్, హాకీ స్టిక్ బాల్, నెక్ టై, కటింగ్ ప్లేయర్ ,పెట్టె, విద్యుత్ స్తంభం, చాయ్ కెటిల్ గుర్తులను అభ్యర్థులకు కేటాయిస్తున్నారు. అభ్యర్థులకు నచ్చకుంటే ఓటును నోటాకు వేసే అవకాశం కూడా ఇస్తున్నారు.

వ్యూహాత్మకంగా ప్రచారానికి సిద్ధం

సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు, 2,268 వార్డు సభ్యులకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. తొలి విడతలో 85 సర్పంచ్ స్థానాలకు 385 నామినేషన్లు, 748 వార్డు సభ్యులకు 1,624 నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయి. రెండో విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. మొదటి విడత అభ్యర్థులు గుర్తుల కేటాయింపుతోనే ప్రచారంలోకి వెళ్లడానికి సిద్ధం అవుతున్నారు. ఐదు మండలాల్లో ప్రచార జోరు అందుకోనుంది. జిల్లాలో 3 లక్షల 53 వేల 351 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,70,772 మంది, మహిళలు 1,82,559 మంది, జెండర్ 20 మంది ఉన్నారు. వీళ్లలో అధికంగా 11,787 మంది మహిళలు పురుషులకంటే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు, 2268 వార్డు సభ్యులు ఉండగా 1,734 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఇందులో ఏకగ్రీవ పంచాయతీలు, వార్డులు తొలిగిస్తారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 200 మంది ఓటర్లు ఉన్న వరకు 1734 పోలింగ్ కేంద్రాలు, 400 ఓటర్ల వరకు 468 పోలింగ్ కేంద్రాలు, 650 ఓటర్ల వరకు ఉన్న పంచాయతీల్లో

మిగతా 8వ పేజీలో..

స్వచ్ఛ హరిత విద్యాలయాలకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్వచ్ఛ హరిత విద్యాలయాలకు ఎంపికైన ప్రధానోపాధ్యాయులు, బాధ్యులకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల కోసం సర్వే నిర్వహించగా, జిల్లాలోని 650 పాఠశాలలు సర్వేలో పాల్గొన్నాయి. ఇందులో నుంచి అత్యధిక స్కోర్ పొందిన ఎనిమిది పాఠశాలలు ఎంపిక అయ్యాయి. కేటగిరి 1లో (1 నుంచి 8వ తరగతి వరకు)ఎంపీపీఎస్ నేరేళ్ల, యూపీఎస్ శ్రీవాణి పోతుగల్, ఎంపీపీఎస్ మర్రిగడ్డ, ఎంపీపీఎస్ సిరిసిల్ల నెహ్రూనగర్, కేటగిరి 2 కింద (9 నుంచి 12 తరగతి వరకు) జిల్లా పరిషత్ పాఠశాల జిల్లెల్ల, జిల్లా పరిషత్ పాఠశాల వెల్జిపూర్, కేజీబీవీ ముస్తాబాద్, వివేకానంద హైస్కూల్ వేములవాడ ఎంపికకాగా, ఆయా విద్యాసంస్థల హెచ్‌ఎంలు, బాధ్యులను సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, సతీష్ పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యవర్గం ఎన్నిక



సిరిసిల్లలో ఎన్నికైన సీఐటీయూ కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా సీఐటీయూ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని షాదీఖానలో సోమవారం జరిగిన జిల్లా నాలుగవ మహాసభ ముగింపు సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శిగా కోడం రమణ, ఉపాధ్యక్షులుగా మూషం రమేష్, గురజాల శ్రీధర్, సూరం పద్మ, సహాయ కార్యదర్శులుగా అన్నల్‌దాస్ గణేష్, శ్రీరాముల రమేష్‌చంద్ర, గీన బిక్షపతి, జిల్లా సభ్యులుగా నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఎలిగేటి రాజశేఖర్, మల్యాల నర్సయ్య, బూర శ్రీనివాస్, బదావేణి మంజుల, సావనపెల్లి రాములు, మూషం సురేష్, దాసరి రూప, గట్ల స్వప్న, బెజుగం సురేష్, జిందం కమలాకర్, కవిత, కాసరపు శంకర్, సామనపల్లి శ్రీనివాస్, కుమ్మరికుంట కిషన్, కుడిక్యాల కనకయ్య, సావనపల్లి ప్రభాకర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఏ పార్టీతో అభివృద్ధి జరిగిందో ప్రజలు ఆలోచించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక ఏ పార్టీతో గ్రామాల అభివృద్ధి జరిగిందో ప్రజలు ఆలోచన చేయాలని బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించే స్థాయి బీజేపీ జిల్లా నాయకులకు లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే రూ. 10 లక్షల నుంచి 20 లక్షల వరు డబ్బులు ఇస్తామంటూ ప్రకటనలు చేస్తున్నాయని ఇతర పార్టీల అభ్యర్థులు ఏకగ్రీవం అయితే వారికి డబ్బులు ఇస్తారా అంటూ ప్రశ్నించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయకుండా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కేటీఆర్ ప్రపంచస్థాయి నాయకుడని గల్లీ నాయకుడు కాదన్నారు.

రైతుల ఖాతాల్లో వెంట వెంట డబ్బు జమ చేయాలి

- టెలీ కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో వెంట వెంటనే డబ్బు జమ చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు, ట్యాబ్ ఎంట్రీ, డబ్బుల చెల్లింపు తదితర అంశాలపై జిల్లా పౌర సరఫరా అధికారి, డీఎం, డీసీఓ, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్ జిల్లా అధికారులు, సిబ్బందితో జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయం నుంచి సోమవారం టెలి కాన్ఫరెన్‌లో మాట్లాడారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 239 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 32,085 మంది రైతుల నుంచి 1,98,426 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ. 338 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని వెల్లడించారు. మిగతా రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తి చేసి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు.

కొదురుపాక రిజర్వేషన్‌పై హైకోర్టులో విచారణ

బోయినపలి, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామ పంచాయతీ రిజర్వేషన్‌పై దాఖలైన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. గ్రామంలో జరిగే పంచాయతీ ఎన్నికలకు రెండు పర్యాయాలు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ కేటాయించాలి. గ్రామంలో రెండు పర్యాయాలు మహిళకు కేటా యించడంతో రొటేషన్ పద్ధతి ఉల్లంగించినట్లు భావించి గ్రామానికి చెందిన కత్తెరపాక సుధాకర్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ సందర్భంగా పిటిషనర్ తరుపు న్యాయవాది తీగల రాంప్రసాద్ గౌడ్ వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరుపున రాహుల్ రెడ్డి మండలంలో 23 గ్రామాలు ఉండగా మహిళ రిజర్వేషన్‌లో భాగంగా 50 శాతంలో పదకొండు గ్రామాలకు మహిళ రిజర్వేషన్ వచ్చిందని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పిషనర్ తరుపు న్యాయవాది మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నిబంధనలు ఉల్లంఘించినట్లు హైకోర్టుకు తెలిపారు. గ్రామంలో రిజర్వేషన్ ఎస్‌సి జనరల్ కేటాయించాలని వివరించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి ఎన్నికలు నిర్వహించవచ్చని, రిజర్వేషన్‌పై డిసెంబర్ 29 ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే 29న ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు వేస్తే కోర్టు సంతృప్తి చెందకపోతే గ్రామంలో మరోసారి ఎన్నికలు జరగవచ్చని పిటిషనర్ తరపు న్యాయవాది తీగల రాంప్రసాద్ గౌడ్ తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్



పాల్గొన్న ఆర్‌వోలు, ఎన్నికల సిబ్బంది

సిరిసిల్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు వివిధ అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్‌తో కలిసి శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు. ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్‌ఓలకు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎస్‌ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఆర్‌ఓ తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి సరిచూసుకునేలా పీఓలు, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. శిక్షణలో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ షరీఫోద్దిన్, నోడల్ అధికారి భారతి తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎస్పీ



బాధితుల సమస్య వింటున్న ఎస్పీ మహేష్ బీగీతే

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తుందని ఎస్పీ మహేష్ బీగీతే పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 27 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్‌చేసి బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాలని ఎస్పీ కోరారు.

జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

● ఎస్పీ మహేష్‌బీగీతే

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (అంధ్రజ్యోతి): శాంతిభద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం డిసెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు 30 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ మహేష్ బీ గీతే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డిజే వినియోగించవద్దన్నారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఎస్పీ కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలని అన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుకుసాగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో రూరల్ మండలానికి చెందిన పలువురికి సోమవారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ప్రభుత్వ విప్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్లకు చెందిన మాజీ సర్పంచ్ కరుణాకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకుడు గుడ్ల మైసయ్య సుమారు 20 మందితో కలిసి కాంగ్రెస్ పార్టీకి వచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులభరణం శ్రీనివాస్, సోయినేని కరుణాకర్, పొన్నం మల్లేశం, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా క్యాంప్ ఫైర్.. క్రీడాకారుల ఆటా పాట



క్యాంప్ ఫైర్‌ను ప్రారంభిస్తున్న చల్మెడ రాజేశ్వర్‌రావు



నృత్యాలు చేస్తున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం రాత్రి జరిగిన క్యాంప్ ఫైర్‌లో క్రీడాకారులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ముందుగా ముఖ్య అతిథి కరీంనగర్ డైరీ ఛైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు క్యాంప్ ఫైర్‌ను ప్రారంభించారు. మినీ స్టేడియంలో నవంబర్ 29న రాష్ట్ర స్థాయి బాలబాలికల జూనియర్స్ వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. నవంబర్ 29న ఉమ్మడి పది జిల్లాల బాలబాలికల జట్లు జిల్లా కేంద్రంకు చేరుకోగా అఫీషయల్స్ స్క్రూటింగ్‌లు నిర్వహించారు. రెండవ రోజు నవంబరు 30న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. సోమవారం మూడవ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు జట్ల మధ్య పోటీలు నిర్వంచారు. అనంతరం స్టేడియంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాంప్ ఫైర్ నిర్వహించారు. క్రీడాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్వీ హన్మంతరెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గిన్నె లక్ష్మన్, జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షులు చింతకింది శ్యాంకుమార్, లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాందాస్, కోశాధికారి కోడం శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు లక్ష్మన్, రామస్వామి, రెఫరీ బోర్డు రాష్ట్ర చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో రైలు ఢీకొని..
కరీంనగర్ విద్యార్థి దుర్మరణం


సాయివర్ధన్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో రైలు ఢీకొన్న ఘటనలో కరీంనగర్ బొమ్మకల్ గ్రామానికి చెందిన విద్యార్థి మృతి చెందాడు. రాజ్‌కోట్‌లోని మార్వాడి యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గన్ను సాయివర్ధన్‌రెడ్డి(20) ఆదివారం దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి గన్ను రాజిరెడ్డి బొమ్మకల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తూ, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఆయనకు కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు సాయివర్ధన్‌రెడ్డి రాజ్‌కోట్ సిటీలో మార్వాడి యూనివర్సిటీలో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కరీంనగర్‌కు చెందిన మరికొందరు విద్యార్థులతో కలిసి సాయివర్ధన్‌రెడ్డి షాపింగ్ కోసం హాస్టల్ నుంచి ఔటింగ్‌కు వెళ్లాడు. ఆ సమయంలో రైలు క్రాసింగ్ వద్ద ప్రమాదం జరిగింది. సాయివర్ధన్‌రెడ్డి మరణవార్త తెలియగానే తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఉన్నతచదువుల కోసం గుజరాత్ రాష్ట్రానికి వెళ్లిన సాయివర్ధన్‌రెడ్డి పట్టాతో ఇంటికి వస్తాడనుకుంటే విగతజీవిగా మారాడని కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. సాయివర్ధన్‌రెడ్డి మృతదేహాన్ని కరీంనగర్‌కు తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం మృతదేహం బొమ్మకల్‌కు చేరుకోనున్నట్లు, బొమ్మకల్ గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. సాయివర్ధన్‌రెడ్డి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

విద్యుత్ వైర్లు అపహరణ

ఇల్లంతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో వ్యవసాయ బావుల నుంచి విద్యుత్ వైర్ల అపహరణ జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుండ శ్రీనివాస్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావివద్ద స్టార్టర్ నుండి బోర్‌మోటారుకు వెళ్లే 40మీటర్ల రాగివైరు సోమవారం అపహరణకు గురైంది. ఇదే గ్రామానికి చెందిన గుండ వెంకటేష్‌కు చెందిన 30మీటర్ల విద్యుత్ వైరు అపహరించుకొని పోయారు. కొద్దిరోజుల క్రితం ఎల్లమ్మగుడి సమీపంలోని బోరు వద్ద నుంచి 15మీటర్ల విద్యుత్ వైర్‌ను కత్తిరించుకొని పోయారు. గ్రామంలో వరుసగా బావుల వద్ద దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులు స్పందించి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుచున్నారు.

- మాడ్వీ హిడ్మా పురుడుపోసిన పీఎల్‌జీఏ
- సంచలనాల కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు
- నేటి నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు



కొయ్యూరు అమరత్వం.. పీఎల్‌జీఏ ఆవిర్భావం

మంథని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమ చరిత్రలో కొయ్యూరు ఎన్‌కౌంటర్ సంచలనం రేపింది. మావోయిస్టు అగ్ర నేతలు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు మంథని నియోజకవర్గంలోని (ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) మల్హర్ మండలం కొయ్యూరు అటవీ ప్రాంతంలో 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. వీరి మరణంతో ఆవిర్భవించిన మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఏఎల్‌జీఏ)కు డిసెంబర్ 2తో 24 వసంతాలు నిండాయి. పీఎల్‌జీఏ పేరిట సైనిక బలగాన్ని ఏర్పాటు చేసుకుంది. మావోయిస్టు అగ్ర నేతలు దేశంలోని విప్లవ సంస్థలను ఒక్క తాటి మీదకు తీసుకురావడంలో వీరు చేసిన కృషి దేశ విప్లవోద్యమ చరిత్రలో చిరస్మరణీయమైంది.. యేటా డిసెంబరు 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు కొనసాగుతున్నాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేష్, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు తాడిత, పీడిత ప్రజల విముక్తి కోసం ఉన్నత చదువులను, కన్నవారిని వదిలి ఆయుధాలు చేతపట్టి అజ్ఞాతంలో ఉంటూ సాయుధ పోరాటం చేశారు. సామాన్య కార్యకర్తలుగా పీపుల్స్‌వార్ లో చేరిన ఈ ముగ్గురు కేంద్ర కమిటీ నాయ కుల స్థాయికి ఎదిగారు.

మావోయిస్టు పార్టీకి రక్షణ కవచంగా.. శత్రువులపై మెరుపు దాడులు చేయటానికి.. క్యాడర్‌లో పోరాట స్ఫూర్తిని నింపడానికి.. సాయుధ బలంగా.. సంచనాల అగ్రనేత మాడ్వీ హిడ్మా పురుడు పోసిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) ఆవిర్భావానికి మంగళవారంతో రెండున్నర దశాబ్దాలు నిండాయి. ఇటీవల సంచలనం రేపిన మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత మాడ్వీ హిడ్మా మృతి చెందాడు. ఈ క్రమంలో పీఎల్‌జీఏ 25వ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి.

● ధీరత్వానికి చిహ్నంగా బేగంపేటలో స్థూపం..


బేగంపేటలో కొయ్యూరు అమరవీరుల స్మారక స్థూపం(ఫైల్)

వారి వీరత్వానికి, త్యాగాలకు చిహ్నంగా నాటి పీపుల్స్‌వార్ (మావోయిస్టు) పార్టీ ప్రథమ వర్ధంతి సందర్భంగా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్ జీఏ) పేరిట సైనిక బలగాన్ని ఏర్పాటు చేసుకుంది. దీంతో యేటా వారి స్మారకంగా డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవా లను నిర్వహిస్తూ వ స్తోంది. వీరి స్మారకంగా మంథని డివిజన్‌లోని రామగిరి మండలం బేగంపేటలో మావో యిస్టు పార్టీ నిర్మించిన 53 అడుగుల ఎత్తైనా స్థూపాన్ని 2005 నవంబర్ 13న కుబుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆవిష్కరించారు.

● ఎంసీసీఐ-పీపుల్స్‌వార్ విలీనంతో పీఏల్‌జీఏగా మార్పు..

దేశంలోని రెండు అతి పెద్ద మావోయిస్టు పార్టీలైన సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్, ఎంసీసీఐలు 2004 సెప్టెంబర్ 21న విలీనమై దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని విస్తరించటానికి అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ-మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. దీంతో పీపుల్స్ గెరిల్లా ఆర్మీని కాస్త పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)గా మార్చారు. అప్పటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలుగా పిలుస్తున్నారు. పీఎల్‌జీఏ పూర్తిగా మావోయిస్టు కేంద్ర మిలటరీ కమీషన్ ఆధీనంలో పని చేస్తుంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడు రోజుల కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో దుబంబ మధు(47) అనే వ్యక్తికి కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధిస్తూ కరీంనగర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ లక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షలో భాగంగా ఏడు రోజులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించే విధులు నిర్వహించాలని పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా పలువురికి జరిమానాలు విధించినట్లు చెప్పారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడుతూ రెండోసారి పట్టుబడిన ఓ వ్యక్తికి గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దురువ సోమవారం మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో ఏడుగురుకి రెండు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు.

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మంథనిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ఈత చెట్టు పైనుంచి కింద పడటంతో తాళ్లపల్లి సంతోష్‌గౌడ్ అనే గీతకార్మికుడికి సోమవారం గాయాలయ్యాయి. చెట్టుపై కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడటంతో సంతోష్ గౌడ్‌కు గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తరలించారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దు

హుజూరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించిందన్నారు. కొత్తపల్లి సమీపంలో యూనిట్ నెలకొల్పడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే కాలుష్యంతో శ్వాసకోశ, చర్మ వ్యాధులు, అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయా లని, నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు ఖలీద్, రత్నం, రవీందర్‌బాబు, తిరుపతి, ప్రభాకర్, స్వామి, ప్రకాష్, వెంకటరమణ, రమేష్, గోపాల్ రావు, ముత్యంరాజు, శ్రీనివాస్‌చందు, రవీందర్, సంపత్, దశరథం, లడ్డు, అజ్జు, రాజేశ్వర్ రావు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాజన్న ఆలయ విస్తరణ పనులకు అంతరాయం

- అడుగులో భారీ రాళ్లు రావడంతో పనిచేయని డ్రిల్లింగ్ మిషన్స్

వేములవాడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన విస్తర ణ పనులకు అంతరాయం ఏర్పడింది. ఆలయం లో రూ. 76 కోట్లతో నిర్మల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ అభివృద్ధి పనులను చేపట్టారు. నెల రోజులుగా కొనసాగుతున్న పనుల్లో భాగంగా ఇటీవల వైజాగ్ నుంచి భారీ (బాహుబలి) డ్రిల్లింగ్ మిషన్, క్రేన్‌లను తెప్పించారు. ఈ మిషన్‌ల ద్వారా 33 అడుగుల లోతుతో పిల్లర్ గుంత లు తీస్తున్నారు. ఈ క్రమంలో మిషన్‌లకు భారీ రాళ్లు అడ్డుతగిలి డ్రిల్లింగ్ లోపలికి పోకుండా పక్కకు వెళ్తుండటంతో డ్రిల్లింగ్ పనులు చేయడం ఇబ్బందిగా మారింది. అడుగులో బండరాళ్లు రావడంతో విస్తరణ పనులకు ఆటంకం కలిగింది. ఆలయ డిజైనర్ ఆదేశాల మేరకు పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో డ్రిల్లింగ్ మిషన్, క్రేన్‌లు తిప్పిపంపారు. ప్రత్యామ్నాయంగా మట్టి తవ్వి పనులు చేపట్టడానికి రూపకల్పన చేస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ ఈఈ నర్సింహాచారి తెలిపారు.


తిరిగి వెళ్తున్న భారీ డ్రిల్లింగ్ మిషన్

హైదరాబాద్‌కు క్షతగాత్రుడి తరలింపు

- మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగునూర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలో చామనపల్లికి చెందిన తొంటి రమేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సోమవారం ఉదయం హైదరాబాద్‌కు తరలించారు. మరో మహిళ హైమావతి చికిత్సపొందుతున్నది. ప్రమాదంలో మరణించిన రఘురాం, దేవేందర్‌రెడ్డి మృతదేహాలకు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బాధిత కుటుంబాలకు అప్పగించారు.

● మృతుల కుటుంబాలను ఆసుపత్రి వద్ద కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

దాడి కేసులో నలుగురిపై కేసు

గంభీరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కాలనీకి చెందిన గోల్లేని వెంకటనర్సు, గోల్లేని దేవేందర్, గొల్లేని నరసవ్వ, కవితలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గతంలో భూ వివాదంపై నలుగురు గోల్లేని నర్సయ్యపై కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. సంఘటన సమయంలో అడ్డువెళ్లిన నర్సయ్య భార్య లక్ష్మీ, కొడుకులు గోల్లేని కరుణాకర్, చందులపై కూడా కర్రలతో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారని సీఐ తెలిపారు. నర్సయ్య కొడుకు కరుణాకర్ ఫిర్యాదు మేరకు వెంకటనర్సు, దేవేందర్, నర్సవ్వ, కవితలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కుక్కదాడిలో ఒకరికి గాయాలు

- మరో ఘటనలో లేగ దూడ మృతి

కోనరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోలకాని ముత్తయ్య కుక్క దాడిలో గాయపడ్డాడు. మండల కేంద్రానికి చెందిన ముత్తయ్య వ్యవసాయ పనుల నిమిత్తం వెళుతుండగా వీధి కుక్క దాడి చేయగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. కాగా మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన అనుముల మహేందర్‌కు చెందిన లేగ దూడపై వీధి కుక్కలు దాడి చేయగా మృతి చెందింది. సుమారు రూ. 20 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి

-ఎస్పీ అశోక్ కుమార్ - చోరీకి గురైన 136 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.28లక్షల విలువ చేసే 136 సెల్‌ఫోన్లను సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు ఎస్పీ అశోక్ కుమార్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చన్నారు. మొబైల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే త్వరగా పట్టుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.3.5 కోట్ల విలువ గల 1,548 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించా మన్నారు. ఎవరికైనా సెల్‌ఫోన్ దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని, ఆ నబరుకు ఫోను చేసి అప్పగించాలని సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్ ఖాన్, సీఈఐఆర్ టీం ఆర్ఎస్ఐ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్ అజార్‌లను ఎస్పీ అభినందించారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ బోయవాడకు చెందిన పి.వెంకటేష్ నవంబరు 18న గుంటూరుపల్లిలో ఫోన్‌ను పోగొటుకొని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ నల్గొండలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. సోమవారం రూరల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను వెంకటేష్‌కు అప్పగించారు. ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో ఫణి శ్రీనివాస్(48) కుటుంబ కలహాలతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా కుటుంబంలో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శ్రీనివాస్ భార్య శోభ రెండేళ్ల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోవడంతో ఆయన ఒంటరిగా ఉంటున్నాడు. దాంతో మనస్థాపానికి గురై గత నెల 30న ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శోభ, కూతుళ్లు మేఘన, సహస్ర, కొడుకు అక్షయ్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

చొప్పదండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం చొప్పదండిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర 5వ మహాసభలు ఈ నెల 7, 8, 9న మెదక్‌లో జరగనున్నట్లు చెప్పారు. ఉద్యోగ, కార్మిక వర్గాలు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు కొమ్మనవేని అశోక్, నాయకులు గుంట అంజయ్య, మారం సత్తయ్య, పిట్టల కొమురెల్లి, మారం గంగమల్లు, మంద మల్లేశం, అరిగే కరయ్య, రేగుల తిరుపతి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి


బోల్తా పడిన ట్రాక్టర్

భీమారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రం నుంచి కాచారం రోడ్డులో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడి వెంకటేష్ (41) అనే వ్యక్తి మృతిచెందాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన కల్లెడ వినయ్‌కు చెందిన ట్రాక్టర్‌పై ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వెంకటేష్ కాచారం నుంచి భీమారం వైపునకు వస్తుండగా అదుపు తప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ


ఆది శ్రీనివాస్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రుద్రంగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని రెండు జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే కవ్వంపల్లికి స్వామి చిత్రపటం అందజేస్తున్న నిర్వాహకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. రెండు రోజుల నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎలుక రామస్వామి, మామిడి రాజు, సుదగోని తిరుపతిగౌడ్, గుర్రం ఆదిరెడ్డి, సింగిరెడ్డి వెంకటరాంరెడ్డి, కమలాకర్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

శీతాకాలంలో సిరులు

● క్యాలీఫ్లవర్ సాగుపై రైతుల దృష్టి


కొనాయపల్లిలో క్యాలీఫ్లవర్ తోట

వేములవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీతాకాలంలో సిరులు కురుపించే క్యాలీఫ్లవర్ పంటపై రైతులు దృష్టిసారిస్తున్నారు. దిగుబడి సైతం అధికంగా రావడంతో రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. వేములవాడ పట్టణ పరిధిలోని కొనాయపల్లి, నాంపల్లి, కురుమపల్లి, శాలరామన్నపల్లి గ్రామాల్లోని రైతులు క్యాలీఫ్లవర్ సాగుపై మక్కువ చూపుతున్నారు. క్యాలీఫ్లవర్ సాగుకు వేడి, తేమతో కూడిన వాతావరణం 20 నుంచి 27 డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే అనుకూలంగా ఉంటుంది. విత్తనాలను నర్సరీలో మే, జూన్ నెలలో నాటగా మొలకెత్తిన కొద్ది రోజులకు రైతులు నర్సరీల నుంచి కొనుగోలు చేసి దమ్ముచేసుకున్న భూమిలో అర అంగుళం లోతులో నాటుకోవాల్సి ఉంటుంది. మొక్క మొక్కకు మధ్య 18 అంగుళాల దూరం ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. అవసరాన్ని బట్టి ఎరువులు, నీరు అందిస్తే అధిక దిగుబడులు ఆశించవచ్చు.


క్యాలీఫ్లవర్ సాగు చేస్తున్న రైతు శంకర్

వేములవాడ పట్టణంలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన రైతు గోనె శంకర్ తనకు ఉన్న 20 గుంటల భూమిలో కొంత మేర పచ్చి మిర్చి, చిక్కుడు, బెండ సాగు చేయగా 10 గుంటల్లో క్యాలీఫ్లవర్ సాగు చేశాడు. క్యాలీఫ్లవర్ మొక్కలు నాటిన రోజు నుంచి 90 రోజులకు పంట కోతకు వచ్చింది. మార్కెట్‌లో కూడా మంచి ధర పలుకుతోందని చెపుతున్నాడు. క్యాలీఫ్లవర్ సాగులో అంతరపంటగా ఉల్లి పంటను సాగు చేసుకునే అవకాశం ఉన్నది.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



తలబడుతున్న కరీంనగర్-నల్లగొండ బాలుర జట్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం మినీ స్టేడియంలో పది ఉమ్మడి జిల్లాల 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ పోటీలు సోమవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. లీగ్ పద్ధతిలో బాలబాలికలకు వేరు వేరుగా నాలుగు కోర్టుల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ అభిమతాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

● సెమీ ఫైనల్‌కు చేరిన బాలుర జట్లు వరంగల్, నిజామా బాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జట్లు, బాలికల్లో వరంగల్, నిజాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. మంగళ వారం ఉదయం సెమీ ఫైనల్స్, సాయంత్రం ఫైనల్ పోటీలు జరుగనున్నాయి.

జాతీయ జట్టులో స్థానం సాధిస్తా..

- ముత్యాల మనోజ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారుడు



జాతీయ జూనియర్స్ వాలీబాల్ జట్టులో స్థానం సాధిస్తాను. 2023- 24లో సబ్ జూనియర్స్ అండర్-14 వెస్ట్ బెంగాల్, 2024-25 ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన వాలీబాల్ జాతీయ స్థాయిలో పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించాను.

జూనియర్స్‌లో బంగారు పతకం తెస్తాం..

- చల్ల సాహితీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారిణి



జాతీయస్థాయి జూనియర్స్ పోటీల్లో తనకు అవకాశం వస్తే ఈసారి బంగారు పతకం సాధిస్తాం. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాను. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాం.

అకాడమీ శిక్షణతో ఆట తీరు మారింది..

- విస్లావత్ నరేందర్, నిజామాబాద్ జిల్లా జట్టు క్రీడాకారుడు



వాలీబాల్ అకాడమీలో చేరాక నా ఆట తీరు మారింది. ఉదయం సాయంత్రం శిక్షణతో ఆటలో నైపుణ్యం సాధిస్తున్నాను. 2023, 2024లో సబ్ జూనియర్స్ అండర్-16, అండర్-17 విభాగాల్లో జరిగిన వాలీబాల్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యాను. రాజస్తాన్‌లో జరగనున్న జూనియర్స్ జాతీయ పోటీలకు ఎంపిక అవుతానని నమ్మకం ఉంది.

ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు గుర్తింపు..

- గిన్నె లక్ష్మణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రతిభ ఉన్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి జట్టులో స్థానం సాధిస్తున్నారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 49వ జాతీయ స్థాయి బాలబాలికల జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపిక జరుగుతుంది. డిసెంబరు 16 నుంచి 20 వరకు రాజస్థాన్‌లో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.





బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్య వివాహాల నియంత్రణపై నజర్

- ప్రత్యేక బృందాలతో అవగాహన సదస్సులు
- డిసెంబరు 6వరకు కార్యక్రమాలు
- ప్రతి గ్రామంలో 14మందితో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొన్ని ప్రాంతాల్లో పేదరికం, నిరక్షరాస్యత, అభద్రతాభావం వంటి కారణాలతో బాల్య వివాహాలు చేస్తున్నారు. బాల్య వివాహాలతో బాలికల చదువు మధ్యలోనే ఆగిపోయి, వారి భవిష్యత్ వంటింటికే పరిమితం అయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు చిన్న వయస్సులోనే గర్భవతి కావడంతో సదరు బాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో జగిత్యాల జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చే దిశగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నవంబరు 10న ప్రారంభమైన అవగాహన సదస్సులు డిసెంబరు 6వరకు కొనసాగనున్నాయి. సదస్సుల్లో బాల్య వివాహ నిరోధక చట్టం-2006, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో (ఐసీడీఎస్), మండల స్థాయిలో తహసీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ పర్యవేక్షిస్తారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీవోఏలతో పాటు మరో 12మందిని కమిటీలో సభ్యులుగా చేర్చి చైల్డ్ ప్రొటె క్షన్ కమిటీలను ఏర్పాటు చేశారు. బాల్యవివాహాల రహిత జిల్లాగా జగిత్యాలను మార్చేలా 20మండలాల్లో 19 బృందాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామ పంచాయతీల్లో, జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

● బాల్య వివాహాల నిరోధక అధికారి విధులు

- జిల్లాలో బాల్యవివాహాలపై ఏదైనా ముందస్తు సమాచారం ఉంటే ఇరుపక్షాల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి బాల్యవివాహం చట్టం గురించి వివరించారు. బాల్య వివాహం జరగకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలి.

-పిల్లలతో మాట్లాడి బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించాలి.

-బాల్యవివాహం చేసుకోకుండా ఉండడం అతడి/ఆమె హక్కు అని తెలపాలి.

అవగాహనతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట

-బోనగిరి నరేష్, పీడీ ఐసీడీఎస్, జగిత్యాల జిల్లా



జగిత్యాల జిల్లాలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. బాల్య వివాహాలను నియంత్రించడానికి జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సుల నిర్వహణకు ఆదేశించింది. ఇప్పటి వరకు 15మండలాల్లో సదస్సులు పూర్తయ్యాయి. డిసెంబర్ 6 వరకు మిగతా మండలాలను పూర్తిచేస్తాం. మీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరిపించే ప్రయత్నం చేస్తే చైల్డ్ హెల్ప్‌లైన్-1098, పోలీస్ హెల్ప్‌లైన్-100, వుమెన్ హెల్ప్‌లైన్-181 కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చు. బాల్యవివాహాల నియంత్రణకు అందరూ సహకరించాలి.

కొండగట్టు అగ్ని ప్రమాద నివేదిక పంపండి

- అధికారులను ఆదేశించిన సీఎం
- ముఖ్యమంత్రిని కలిసి ఆదుకోవాలన్న మంత్రి, ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

మల్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులో అగ్నిప్రమాదానికి సంబంధించిన నివేదికను వెంటనే పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి ప్రమాద ఘటన గురించి వివరించారు. ప్రమాదంలో ముప్పైకి పైగా దుకాణాలు కాలిపోయి అనేక కుటుంబాలు నిరాశ్రయులు అయ్యాయన్నారు. బాధిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిహారం అందజేతకు నివేదిక కోరిన సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

విమానాశ్రయం స్థల సర్వే కోసం ఏఏఐ బృందం రాక



పెద్దపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం ఈ నెల 3, 4 తేదీల్లో ఎయిర్ పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందం రామగుండం సందర్శించి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బసంత్‌నగర్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా రామగుండంలో పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చామని, ఈ విషయ మై పలుమార్లు కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసి విజ్ఞప్తి చేశారు. అందుకు సమ్మతించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్రీ- ఫీజిబిలిటీ స్టడీ కోసం 50 లక్షల రూపాయలు కూడా కేంద్రానికి చెల్లించామని పేర్కొన్నారు. సోమవారం మరోసారి కేంద్ర మంత్రిని కలిసి త్వరగా సర్వే చేపట్టాలని కోరగా, ఆయన వెంటనే స్పందించారని తెలిపారు. ఈ నెల 3 లేదా 4వ తేదీన ఎయిర్ పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా బృందం రామగుండం సందర్శించనున్నదని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఇక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణమైతే పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ఆసిఫాబాద్, తదితర జిల్లాల వాసులకు రవాణా సౌకర్యం మరింత మెరుగు పడనున్నదని అన్నారు.

ఆదమరిస్తే.. అనంతలోకాలకే

సెప్టిక్ ట్యాంక్ మ్యాన్ హోల్స్‌తో పొంచి ఉన్న ప్రమాదం

జగిత్యాల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఇదివరకే ఏర్పాటు చేసిన రోడ్లు ఉన్నప్పటి ఈ మధ్యకాలంలో అధికారులు కొత్త రొడ్డు నిర్మాణం చేశారు. ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారులు రోడ్డు నిర్మాణం చేస్తున్న క్రమంలో 60 యేళ్ల కిందట ఎస్సారెస్పీ అధికారుల కోసం క్వార్టర్లు నిర్మించి వాటి కోసం పెద్ద సెప్టిక్ ట్యాంక్‌లు కట్టారు. అధికారులు సెప్టిక్ ట్యాంక్ అడ్డుగా వచ్చిన చోట రోడ్డును కొంత మలుపు తిప్పి నిర్మాణం చేశారు. అక్కడే ప్రైమరీ స్కూల్, హైస్కూల్‌తో పాటు వైద్య విద్యార్థుల వసతి గృహాలు ఉన్నాయి. అధికారులు కొత్త రోడ్డు నిర్మించడంతో ఇటు విద్యార్థులు, నిత్యం వాకింగ్ చేసే వాకర్లు సైతం ఇదే రోడ్డును ఉపయోగిస్తున్నారు.



మ్యాన్‌హోల్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు

రోడ్డును ఆనుకొని గడ్డితో కప్పబడి ఏర్పడకుండా ఉన్న సెప్టిక్ ట్యాంక్ మ్యాన్ హోల్స్ పెను ప్రమాదంగా మారాయి. గమనించకుండా ముందుకు సాగితే మ్యాన్ హోల్స్‌లో పడే ప్రమాదం ఉంది. వీధిలైట్లు కూడా లేవని ప్రమాదకర మ్యాన్ హోల్స్‌ను పూర్తిగా మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

తిమ్మాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా సంఘటన స్థలంలోనే తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఎల్‌ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని రేకుర్తికి చెందిన పొన్నం శ్రీకాంత్ గౌడ్(32) హైదారాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం హైదారాబాద్ నుంచి కరీంనగర్‌లోని ఇంటికి వచ్చినట్లు సమాచారం. సోమవారం రాత్రి తిమ్మాపూర్ వైపు వచ్చిన పొన్నం శ్రీకాంత్‌గౌడ్ కరీంనగర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో తిమ్మాపూర్ రాజీవ్ రహదారి పక్కనున్న ఓ మటన్ ట్రెడర్స్ సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని అపి రోడ్డుకు అవతలి వైపునకు వెళ్తున్నాడు. శ్రీకాంత్‌గౌడ్‌ను కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలతో శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడు శ్రీకాంత్‌గౌడ్ కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్ గౌడ్ సోదరుడు.



శ్రీకాంత్‌గౌడ్(ఫైల్)

ఆ రెండు గ్రామాల్లో ఎన్నికలు లేవు..

సైదాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే విధించింది. మండలంలోని 27 గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు ఉండడంతో ఆయా గ్రామాలు సందడిగా కనిపిస్తున్నాయి. రామచంద్రాపూర్, కరుమపల్లి గ్రామాలు మాత్రం వెలవెలబోతున్నాయి. రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాలు కలిసి ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉండేది. కురుమపల్లి గ్రామ ప్రజలు తమ ఊరికి ప్రత్యేక గ్రామ పంచాయతీ కావాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి సర్పంచ్ గ్రామసభలో తీర్మానం చేసి కురుమపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీంతో ప్రభుత్వం కురుమపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. రాంమచంద్రాపూర్‌కు చెందిన కొందరు గ్రామస్థులు కురుమపల్లికి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు తగిన అర్హతలు లేవని, నిబంధనలకు విరుద్ధంగా రెండు గ్రామాలను విడగొట్టారని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టే విధించింది. దీంతో ఈ గ్రామాల్లో ఎన్నికలను అధికారులు నిలిపివేశారు. ఈ రెండు గ్రామాలకు అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాంచంద్రాపూర్‌కు జనరల్, కురుమపల్లికి బీసీ జనరల్ కేటాయించారు. ఆశావాహులు ఎన్నికలు జరుగుతాయని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈదశలో హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికలు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఆశావహులు నిరాశ చెందారు.



రాంచంద్రాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినీలు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన హారిక, యశశ్విని, తేజస్విని, నిత్యశ్రీ, చందన జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా విద్యార్థినులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

వేములవాడలో భక్తజన సందోహం



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

వేములవాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆలయం భక్తజన సందోహంతో నిండుకుంది. సోమవారం భక్తులరద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో రాజరాజేశ్వర స్వామివారిని, భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించు కుని తరించారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఇందుకు నాలుగు గంటల సమయం పట్టింది. భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న అన్నదాన సత్రం పైఅంతస్తులో కల్యాణం, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కల్యాణానికి అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరగడంతో 117 టికెట్లు జారీ చేశారు. కేవలం దంపతులను మాత్రమే అనుమతించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షిస్తూ తగిన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్నానాలకు, తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. తగినన్ని పాయింట్స్ లేకపోవడంతో భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆలయానికి వచ్చే వాహనాలను భీమేశ్వరాలయం వైపు అనుమతించలేదు. పార్కింగ్, అన్నదానసత్రం వద్ద నోఎంట్రీ బోర్డులు పెట్టారు. దీంతో భక్తుల వాహనాలు ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు.

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు తృతీయ స్థానం



ఉమ్మడి జిల్లా బాలుర ఖో-ఖో జట్టు సభ్యులతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో గత నెల 28, 29, 30 తేదీల్లో 44వ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలు నిర్వహించారు. సెమీఫైనల్‌లో ఆదిలాబాద్ జట్టుతో తలపడి ఓటమి చెంది తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా బాలుర జట్టును జిల్లా ఖోఖో అసోసియేయేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు ట్రాఫిక్ ఆర్‌ఐ కుమారస్వామి, వి.సూర్య ప్రకాశ్, చిట్టి తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎ.రవీందర్, డాక్టర్ వి.నవీన్ కుమార్, ఎస్‌కే మొయుద్దీన్, కట్ట సంతోష్, బి.శేఖర్, ఆర్.తిరుపతిరెడ్డి, యోగేష్, వి.శ్రీలత, పి.జ్యోతి, జి.రేణుక, సంధ్య, ఖో-ఖో కోచ్‌లు నరేష్, వెంకటేష్, ఆనంద్, జలంధర్, కరుణాకర్, అశోక్ అభినందించారు.

పెన్షనర్ల బకాయిల కోసం..

ప్రత్యేక నిధులు విడుదల చేయాలి

- 'రేవా' రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల (పెన్షనర్ల) బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం (రేవా)రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఫిలింభవన్‌లో ఏర్పాటు చేసిన రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 నెలలుగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ రూపాయలను ప్రభుత్వం ఇవ్వలేదని, పదవీ విరమణ పొందిన వెంటనే ఇవ్వాల్సిన వీటిని ఇప్పటి వరకు ఇవ్వక పోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చాలామంది అనారోగ్యాలకు గురై చనిపోతున్నారని ఆవేద న చెందారు. ఈ విషయమై పెన్షనర్ల సంఘాలు హైదరా బాద్ ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయడంతో స్పందించిన ప్రభుత్వం రూ.707.30 కోట్లు విడుదల చేసిందని అన్నారు. అవి కేవలం పదవిలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాత్రమే వారి పెండింగ్ బకాయిల చెల్లింపులకు సరిపోతాయే తప్ప పెన్షనర్లకు బకాయిల చెల్లింపులు జరగవని, ప్రభుత్వ ప్రత్యేక నిధులు పెన్షనర్ల కోసం విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పెన్షనర్లందరికి ఏక మొత్తంగా బకాయిలను చెల్లించేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అవసరమైన కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వరచారి, కోశాధికారి కనపర్తి దివాకర్, జగిత్యాల జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఎం.రాంరెడ్డి, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధా కర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పోనమల్లు రాములు, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేవా రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు చరితేష్ ప్రాజెక్టు

శంకరపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలకు శంకరపట్నం మండలం మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముత్తునూరి చరితేష్ ప్రాజెక్టు ఎంపికైంది. సీనియర్స్ విభాగంలో వాహన ప్రమాదాన్ని నిలువరించే వాస్ కోట్ ప్రాజెక్టు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు బాబు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కంకణాల నీరజ, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా గీతా జయంతి ఉత్సవాలు


కోడె మొక్కు చెల్లిస్తున్న ఈఓ

వేములవాడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం గీతా జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు స్వామి వారికి ఉదయం 11 మంది ఋత్వికులచే మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో అర్చనలు, గీత హోమం గావించారు. ఆలయాల్లో అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోడె మొక్కు చెల్లించిన ఈఓ రమాదేవి

భీమేశ్వర స్వామి ఆలయంలో లోక కల్యాణం, విశ్వశాంతి కోసం సోమవారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. శాంతి హోమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని మర్రిగడ్డ మల్యాల తిమ్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ మహేష్ సోమవారం తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున మర్రిగడ్డ, మల్యాల, తిమ్మాపూర్, సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో మర్రిగడ్డ, తిమ్మాపూర్, మూడపల్లి, అనంతపల్లి అశిరెడ్డిపల్లి జోగాపూర్, ఎనగల్, రామన్నపేట, చందుర్తి, మల్యాల, చెరువు కుంటపల్లె, మూడపల్లి, నర్సింగాపూర్ ఉదయం 9:00నుంచి మధ్యాహ్నం 3:00 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని

చందుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని చందుర్తి ఎస్సై రమేష్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో కమ్యూనిటీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ మద్యం, నగదు, ఉచితాల పంపిణీపై నిఘా ఉంటుందన్నారు.

6న దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో స్మారక సభ

ఇల్లంతకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 6న దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో స్మారక సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అన్ని గ్రామాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వీరిలో బహుజన ఉద్యమకారులు ఏనుగుల లింగన్న, మామిడి విజయ్ తదితరులు ఉన్నారు.

పెద్దమ్మ చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

గంభీరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్ పోస్టును సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన తనిఖీలు చేసిన చేసి నమోదు చేసిన రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును ప్రత్యక్షంగా డిఎస్పీ పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అక్రమ నగదూ, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని ఈ సందర్భంగా సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం ఇతర విలువైన వస్తువులు తీసుకెళుతున్నట్టు సమాచారం ఉంటే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైన పాల్పడితే వారిపై ఎన్నికల నియామవళి ప్రకారం చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నాగేంద్రచారి వెల్లడించారు.

కుల సంఘాల మద్దతుకు యత్నాలు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఆశావహుల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో కుల సంఘాల మద్దతును కూడగట్టేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో సామాజిక వర్గం నుంచి ఐదుగురు, ఆరుగురు పోటీల్లో నిలుస్తామని తహతహలాడుతుండడం వల్ల కుల సంఘాల పెద్దలు ఒకరినే బరిలో నిలిపేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారు. సోమవారం ఒకటో తేదీ కావడంతో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని గ్రామాల్లో వివిధ కుల సంఘాల సమావేశాలు ఎన్నికలను తలపించాయి. ఇక్కడ గెలిస్తేనే.. సర్పంచి గిరి దక్కేదన్నట్లు సాగాయి. పెద్దలు పేర్కొన్న వారిని మిగతా వారు అంగీకరించకపోవడంతో సంఘాల్లోనే సర్పంచ్ అభ్యర్థి ఎంపికకు పోటీ సాగింది. ఉదయం నుంచి ఆశావాహులు సభ్యుల మద్దతుకు యత్నించారు. సర్పంచ్ పోటీల్లో ఉండే ఒక్కో అభ్యర్థి సంఘాలకు భారీ మొత్తంలో డబ్బులు చెల్లిస్తామంటూ ప్రకటించారు. పలు గ్రామాల్లో అధికంగా నగదు ఇస్తామన్న వారిని ఎంపిక చేయగా మరికొన్ని పల్లెల్లో పోటీ అనివార్యమైంది. కుల సంఘాల్లో ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. మొత్తం మీద హమ్మయ్య కుల సంఘంలో గెలిచాను.. సర్పంచి పదవికి మార్గం సుగమమైందని ఆశావహులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న నవీన్‌కుమార్

ఇల్లంతకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్ గ్రామానికి చెందిన ప్యాక్స్ మాజీ డైరెక్టర్ నాయిని నవీన్‌కుమార్ మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గకేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల విజయం సాధించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు గుండ వెంకటేశం, పర్శరాం, గొల్లకోమటి శంకర్, స్వామిరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్

● మనస్థాపంతో గుండెపోటు ● ఒకరి మృతి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుగా తీసుకున్న డబ్బుల కింద భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తుండటంతో మనస్థాపానికి గురైన శ్రీధర్‌రెడ్డి (49) ఆదివారం రాత్రి గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని రెడ్డివాడకు చెందిన శ్రీధర్‌రెడ్డి తన అవసరాల కోసం చంద్రంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తివద్ద రూ. 25లక్షల అప్పుగా తీసుకున్నాడు. అయితే అప్పు ఇచ్చిన వ్యక్తి శ్రీధర్‌రెడ్డికి చెందిన స్థలాన్ని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని తెలిపారు. ఇటీవల తన స్థలాన్ని శ్రీధర్‌రెడ్డి వేములవాడకు చెందిన వారికి రూ.45లక్షలకు విక్రయించగా అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.15 లక్షలను అప్పు ఇచ్చిన వ్యక్తికి ఇచ్చి స్థలాన్ని తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని కోరినా ఆ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతోపాటు శ్రీధర్‌రెడ్డి భార్యపేరుతో ఇచ్చిన చెక్కుపై బౌన్స్ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారు. మరో వైపు స్థలం కొనుగోలుకు అడ్వాన్స్‌గా డబ్బులు ఇచ్చిన వారు ఒత్తిడికి గురిచేస్తుండడంతో శ్రీధర్‌రెడ్డి ఆదివారం గుండెపోటుకు గురై ఇంటిలో పడిపోవడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఏకగ్రీవం కోసం ఒక్కటవుతున్న గ్రామస్థులు


గుంటపల్లిచెరువు తండా వాసులను అభినందిస్తున్న తోట ఆగయ్య


ఏకగ్రీవంపై నిర్ణయం తీసుకున్న హీరాలాల్‌తండా గ్రామస్థులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువుతండా పంచాయతీ పాలక వర్గం ఎన్నికను ఏకగ్రీవం చేయాలని తండావాసులు సోమవారం నిర్ణయించారు. తండాలో సమావేశమైన గ్రామస్థులు సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకోవాలని తీర్మాణించారు. 326 మంది జనాభా ఉన్న తండాలో 121 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించారు. సర్పంచ్‌గా భూక్య తిరుపతి, ఉప సర్పంచ్‌గా గుగులోతు మోహన్, వార్డు సభ్యులుగా భూక్య మంగవ్వ, గుగులోతు బిక్షా, మాలోతు నబ్యా, నునావత్ గణేశ్, నునావత్ శారదలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎన్నుకున్న వారు తప్పా ఎవరూ నామినేషన్ దాఖలు లేయకూడదని తీర్మానించారు. బీఆర్ఎస్ మద్దతుదారులు సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవ తీర్మాణం చేయడం పట్ల ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పుణ్యానాయక్, రమేశ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని హీరాలాల్‌తండా గ్రామస్థులు సోమవారం సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవం కోసం ఒక్కటయ్యారు. గ్రామ సర్పంచ్‌ను, వార్డు సభ్యులను పోటీ లేకండా ఏకగ్రీవం చేసుకుందామని నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్ సహ, ఆరుగురు వార్డు సభ్యులను పార్టీలకు అతీతంగా ఏకగ్రీవం చేసుకుందామని, పోటీగా ఎవరూ నామినేషన్ వేయద్దని గ్రామస్థులు ఐక్యత చాటారు. సర్పంచ్‌గా భూక్య పద్మ-దేవ్‌సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్ పదవికి, వార్డు సభ్యుల పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు.

'గుర్తు'ల కోసం టెన్షన్

(5వ పేజీ తరువాయి)

76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం సిద్ధం చేస్తున్నారు. అంతకుమించి ఓటర్లు ఉంటే రెండవ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. గుర్తును ఓటర్లు ఎలా గుర్తు పెట్టుకుంటారనే టెన్షన్ అభ్యర్థుల్లో కనిపిస్తోంది. ప్రధానంగా గుర్తును మర్చిపోకుండా ప్రచారం చేయడానికి వ్యూహాత్మకంగా ప్రచారానికి సిద్ధమవుతున్నారు. తొలి విడత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపుతోనే ప్రచార రంగంలోకి అడుగు పెట్టడాని అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.. గుర్తులు గుర్తుండే విధంగా అందుకనుగుణంగా కానుకలు అందించడానికి సిద్ధమయ్యారు. ఎన్నికల ఖర్చు నిబంధనలు కఠినతరం కావడంతో అభ్యర్థులు అయోమయంలో పడుతున్నారు. వీటిలో ఐదు వేల జనాభాలోపు గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థి రూ.1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 30 వేలు, 5 లక్షలపైగా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ. 2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ. 50 వేలు ఖర్చు పరిమితి ఉంది. ఓటర్లు సులువుగా గుర్తుపట్టేలా తమకు గుర్తు రావాలనే ఆశతో అభ్యర్థులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం


గంభీరావుపేటలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

గంభీరావుపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. గంభీరావుపేటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులనే గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లకు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు గ్రామాలను అభివృద్ధి ఎలా చేస్తారో చెప్పాలన్నారు. పదేళ్ళు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పనులకు అప్పులు చేసిన అప్పటి సర్పంచ్‌లు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో ఉన్నారన్నారు. మొన్న వర్షాలకు మానేరు వద్ద ఐదుగురు రైతులు వరదల్లో చిక్కుకుంటే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హెలికాప్టర్లను తెప్పించి ఒడ్డుకు చేర్చిన విషయాన్ని గోపి గుర్తు చేశారు. లింగన్నపేట నుంచి కోరుట్లపేట వరకు రూ: 17 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో డబుల్ రోడ్డు మంజూరు జరిగిందని, గంభీరావుపేట నుండి మల్లారెడ్డిపేట వెళ్ళేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో మానేరు వాగుపై రూ.7 కోట్లతో తాళ్ళఎల్లమ్మ వద్ద బ్రిడ్జి నిర్మాణం జరిగిందన్నారు. ఎంపీ నిధుల నుండి పలు కుల సంఘాల భవనాల కోసం దాదాపు 50 లక్షల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, దేవసాని కృష్ణ, పత్తి స్వామి, సర్వోత్తం ఉన్నారు.

అయ్యప్పస్వామి సేవలో ప్రభుత్వ విప్

వేములవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని అయ్యప్పస్వామి ప్రత్యేక పూజలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సోమవారం పట్టణంలోని మున్నూరుకాపు సత్రం సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, అయ్యప్పస్వాములు ఉన్నారు.

ప్రత్యర్థిపై ఫిర్యాదు

వేములవాడ రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల సందర్భంగా వట్టెంల గ్రామానికి చెందిన రంగు వెంకటేశం తనపై ఉన్న కేసుల వివరాలు ఎన్నికల అఫిడవిట్‌లో తెలపలేదని యామ రవీందర్ ఆర్డీవో రాధాబాయికి సోమవారం ఫిర్యాదు చేసాడు. దీనిపై తన ప్రత్యర్థిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తంగళ్లపల్లిలో మండలంలో నామినేషన్లు

తంగళ్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలో పది నామినేషన్ల కేంద్రాల్లో రెండవ రోజు 80 నామినేషన్లు సర్పంచ్ పదవికి, 161 నామినేషన్లు వార్డులకు దాఖలు అయ్యాయి. అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా హెల్ప్‌డెస్కులు ఉన్నాయి.

మహిళలు, బాలికలు భయం వీడాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు వివక్షత, హింస, వేధింపులకు భయపడకుండా ధైర్యంతో ముందుకు సాగాలని మహిళా సాధికారత జిల్లా ప్రతినిధి దేవిక అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ మిషన్ పరివర్తన, మహిళా సాధికారత, సఖీ కేంద్రం సంయుక్తంగా విద్యార్థినులకు మాదక ద్రవ్యాల నివారణ, బాల్య వివాహాలు, వేధింపులపై సోమవారం అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు, యువతలు వేధింపులకు గురైతే తమకు సమాచారం అందిస్తే సఖి కేంద్రం అండగా ఉంటుందని అన్నారు. ఏ సమస్య ఉన్న తమకు ఫిర్యాదు చేయాలని దేవిక కోరారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ జనార్ధన్, సఖి కేంద్రం అధికారి కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ హరిత విద్యాలయంగా వెల్జీపూర్ ఉన్నత పాఠశాల


ప్రధానోపాధ్యాయుడిని అభినందిస్తున్న డీఈవో

ఇల్లంతకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతతో పాటు పారిశుధ్యం మెరుగ్గా ఉండే పాఠశాలలను గుర్తించి అందజేసే స్వచ్ఛ హరిత విద్యాలయం పురస్కారాన్ని వెల్జీపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల అందుకుంది. స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇచ్చే పురస్కారానికి రెండు విభాగాలలో ఎంపిక చేస్తారు. 9నుండి 12వతరగతి స్థాయిలో ఇచ్చే పురస్కారానికి జిల్లానుండి 650ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పోటీపడ్డాయి. పాఠశాలలో కేటగిరీల వారిగా నీటి నిర్వాహణలో 90.91శాతం, హ్యాండ్ వాషింగ్‌లో వందశాతం, మరుగుదొడ్ల నిర్వహణలో 88.89శాతం మార్కులు సాధించింది. దీనితో స్వచ్ఛహరిత పురస్కారంలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. సోమవారం జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాట్నపెల్లి స్వామిరెడ్డికి జిల్లా విద్యాధికారి వినోద్ ప్రశంసా పత్రాన్ని అందించారు.

పాఠశాలకు అవార్డు రావడానికి కృషిచేసిన ఎకో క్లబ్ కోఆర్డినేటర్ అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, ఎకోక్లబ్ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు అభినందనలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నా కరపత్రాలను టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు రొక్కం దేవారెడ్డి ఆవిష్కరించారు. జర్నలిస్టులకు కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జొన్నల రాజు, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు దుంపేట నాగరాజు, సలహాదారు మాందాల సంజీవ్, సభ్యులు నరేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : ఈ నెల 3న హైదరాబాద్‌లో జరిగే జర్నలిస్టుల మహాధర్నా కరపత్రాలను సోమవారం గంభీరావుపేటలో జర్నలిస్టులు విడుదల చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను విజవంతం చేయాలని జర్నలిస్టులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్లూజే ఐజేయూ అధ్యక్షుడు రహీం, సీనియర్ జర్నలిస్టులు యాదగిరిగౌడ్, శ్రీనివాస్, జర్నలిస్టులు మల్లేశం, రమేష్, పల్లె శ్రీనివాస్, అర్జున్‌రెడ్డి, అంజనేయులు, సంతోష్‌చారీ, శ్రీకాంత్, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయుడబ్ల్యూజే) అసోషియేషన్ మండల అధ్యక్షుడు అవధూత బాలశేఖర్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణతల్లి విగ్రహ కూడలిలో సోమవారం కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని మసాబ్‌ట్యాంకు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పెద్దిగారి దేవరాజు, కూర సంతోష్, సుంచు బాబు, చెవుల మైలారం యాదవ్ పాల్గొన్నారు.

నామినేషన్ తిరస్కరించాలి

కోనరావుపేట, డిసెంబర్ 1: నిమ్మపల్లిలో ఉప్పరుల నామినేషన్‌లు తిరస్కరించాలని, ఎస్సీ జనరల్ రిజర్వేషన్ స్థానంలో బీసీ మహిళ ఎస్సీ సర్టిఫికెట్‌తో నామినేషన్ వేసిందని నిమ్మపల్లి ఎన్నికల అధికారికి, తహసీల్దార్‌కు, వేములవాడ ఆర్డీఓకు ఎస్సీ స్థానంలో పోటీచేసిన అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. ఎస్సీ స్థానాల్లో ఏబిసిడి వర్గీకరణ అయ్యాక వచ్చిన 2025 నూతన సర్టిఫికెట్‌లు మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని నామినేషన్ వేసిన అభ్యర్థులు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):33కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మర్రిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ రాకేష్ తెలిపారు.

కార్యవర్గాల ఎన్నిక

రుద్రంగి, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): రుద్రంగిలో రెండు యువజన సంఘాలకు కార్యవర్గాలను సోమవారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పటేల యూత్ అధ్యక్షుడిగా కోల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పల్లికొండ చింటూ, ప్రధాన కార్యదరిర్శులుగా కోల నరేష్, ఎర్రం అరవింద్, కోశాధికారిగా పల్లికొండ వినయ్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నరు. అలాగే ఆదర్శయాత్ నూతన అధ్యక్షుడిగా నాగులపెల్లి సంతోష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్లాల నర్సారెడ్డి, కోశాధికారిగా నల్ల సంజీవరెడ్డి, కార్యదర్శిగా పిడుగు లచ్చిరెడ్డిలు ఎన్నికయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో అడవి జంతువుల దాడి

కోనరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. మండల కేంద్రానికి చెందిన ముదాం నవీన్ అనే రైతు కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యాన్ని ధ్వంసం చేశాయి. ధాన్యం మీద కప్పిన కవర్లను చింపివేస్తూ ధాన్యాన్ని పాడు చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల తనిఖీ

చందుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాగంగా ఎంపీడీఓ కార్యాలయంను ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సురక్షితమైన జీవనశైలితో హెచ్ఐవీని అరికట్టవచ్చు


జ్ఞాపిక అందిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత


చందుర్తిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకిన వ్యాధిగ్రస్తులు సురక్షితమైన జీవనశైలి పద్ధతులు పాటిస్తే వ్యాధి అదుపులో ఉంచుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఆవరణలో ఎయిడ్స్ ర్యాలీ ప్రారంభించారు. ఆసుపత్రి నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ రజిత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 2024 ఏప్రిల్ 25 నుంచి 2025 నవంబరు 25 వరకు 2,521 మంది గర్భిణిలకు పరీక్షలు చేయగా ఒక్కరికి పాజిటివ్ వచ్చిందన్నారు. హెచ్ఐవీ అనుమానితులగా భావించి 4,118 మందికి పరీ క్షలు చేయగా 26 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. జిల్లాలోని గ్రామాలలో మహిళా సమైఖ్య సభ్యులు, లింక్ వర్కర్ల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించి అరికట్టడానికి కృషి చేయాలన్నారు. అనంతరం వ్యాధి నివారణలో ఉత్తమ సేవలను అందించిన సిబ్బందికి డాక్టర్ రజిత మెమొంటో, ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి అనిత, ఏవో శ్రీనివాస్, దేవిసింగ్, డిప్యూటీ డెమో రాజకుమార్, ప్రభుత్వ ఆసుపత్రి ఎయిడ్స్ కౌన్సిలర్లు గంగయ్య, ఎన్జీవో అధ్యక్షుడు చింతోజు భాస్కర్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

● అవగాహన ఎగ్జిబిషన్ ప్రారంభం

సిరిసిల్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సిరిసిల్లకు చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ రాణీప్రసాద్ ఎయిడ్స్ అవగాహన కలిగిస్తూ రూపొందించిన చిత్రాలతో సిరిసిల్ల సృజన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. కార్యక్ర మంలో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కందేపి ప్రసాదరావు, బాలసాహితీవేత్త డాక్టర్ రాణీప్రసాద్, డాక్టర్ కే స్వాతి, డాక్టర్ కే స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఆస్పత్రి మేనేజర్ సృజన్ సింధూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకుని నివారణకు కృషి చేయాలని వైద్యాధికారి సరియాఅంజుమ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఎయిడ్స్ వ్యాధి నివారణపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సరియాఅంజుమ్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని అన్నారు. పాముకాటుకు గురైతే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రథమ చికిత్సపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద షట్, మంజీద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏయిడ్స్ వ్యాధిపై ప్రిన్సిపాల్ దేవరాజం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఆవరణలో సోమవారం అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు భారతదేశంలో దక్షణాది రాష్ట్రాలైన మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలలో హెచ్ఐవి వ్యాప్తి ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కుమారస్వామి, అధ్యాపకులు లింగమూర్తి, విజయ్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి : ఎయిడ్స్ మహమ్మారి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణవేణి పేర్కొన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ ఎయిడ్సడే సందర్భంగా అవగాహన నిర్వహించారు. ప్రభుత్వం ఎయిడ్స్‌ను అరికట్టేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈఓ ఆంజనేయులు, రాజేందర్ సూపర్వైజర్లు కౌసల్య, విజయరాణి సిబ్బంది రజిని, సృజన, మమత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.